
THE LARGEST CIRCULATED
TELUGU CHILDREN'S MAGAZINE

# బాలభారతం

జనవరి 2017    వెల: ₹20





# పరోపకారార్థం!


వరన్న, వెంకన్న అన్నదమ్ములు. వరన్నది తనకున్నదాంట్లో పదిమందికీ పెట్టే గుణం. వెంకన్న తన కోసం తప్పితే ఎవరి గురించీ ఆలోచించడు. కానీ 'అన్నయ్యా! నువ్విలా దానాలు చేస్తూపోతే ఆఖరికి నీకేం మిగలదు. అప్పుడు నువ్వు చెయ్యి చాచినా ఎవరూ ఆదుకోరు. నువ్వంటే నాకిష్టం కనుక చెప్తున్నా! దానధర్మాలవీ తగ్గించుకో' అని చెప్పేవాడు.

దానికి వరన్న 'ఒరే తమ్ముడూ! నాకు నువ్వెంతో, బయటివాళ్లూ అంతే. నేను చేసిందానికి ప్రతిఫలం ఆశించను. రేపోనాడు నువ్వున్న పరిస్థితే ఎదురైతే ఎవ్వరినీ తప్పు పట్టను. ఆ స్థితిలో కూడా ఎవరికీ సహాయం చెయ్యలేకపోతున్నాననే బాధపడతానేమో! బతికినన్నాళ్లూ 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్న దానికి కట్టుబడి ఉంటాను' అనేవాడు.

ఒకసారి అత్యవసర పనిమీద దూర ప్రాంతమైన రత్నాపురానికి వెళ్లారిద్దరూ. తిరుగు ప్రయాణంలో జోరున వర్షం మొదలైంది. అక్కడున్న ఓ గుడిలో తలదాచుకున్నారు. బాగా ఆకలేస్తోంది. పూజారి పెట్టిన ప్రసాదం తినేసరికి ఆకలి మరింత ఎక్కువైంది. అలసటతో విశ్రాంతి తీసుకోవాలనిపిస్తోంది వాళ్లకి. అంతలో గుళ్లో కొచ్చిన ఓ వ్యక్తి వీళ్ల వంక తదేకంగా చూసి దైవ దర్శనం చేసుకుని వెళ్లిపోయాడు.

'అన్నయా! ఆ వ్యక్తి ఎవరో తెలుసా? పున్నయ్య. కిందిటేడాది వ్యాపారం చేసుకుంటానని డబ్బు సాయం కోరి ఊళ్లోకొచ్చాడు. అందర్లోకీ నువ్వే ఎక్కువిచ్చావు. చూశావా చూసి కూడా పలకరించకుండా ఎలా వెళ్లిపోయాడో. ఎవరికీ సాయం చెయ్యొద్దంటే నువ్వు వినవు' అన్నాడు కోపంగా వెంకన్న.

'అవునా! ఇప్పటిదాకా అతనెవరా అని ఆలోచిస్తున్నావా? నేనైతే సాయం చెయ్యాల్సి వచ్చినప్పుడే మనుషుల్ని గుర్తుపెట్టుకుంటాను. తర్వాత మర్చిపోతాను. మనం చేసిన సాయం ఊరికేపోదు. ఆ ఫలితమేనేమో! వర్షంలో తడవకుండా ఈ గుళ్లో తలదాచుకునేందుకు



మనకింత చోటు దొరికింది. అది చాలదా! సరేగానీ... వర్షం తగ్గాక బయలుదేరుదాం. అంతవరకు ఓపికపట్టు' అన్నాడు నవ్వుతూ.

కొద్దిసేపటికి పున్నయ్య కంగారుగా వచ్చి 'ఇందాక మిమ్మల్నిద్దర్నీ చూసినప్పట్నుంచీ నా మనసు మనసులో లేదు. నేను మిమ్మల్ని పలకరించకుండా వెళ్లినందుకు క్షమించండి. మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. కానీ ఈ వర్షంలో మా ఇంటికి తీసుకెళ్లడానికి ఎటువంటి బండ్లూ దొరకవు. ఏంచేయాలో తోచక ఆ కంగార్లో మీతో మాట్లాడకుండానే నా మిత్రుడి ఇంటికెళ్లి బండి తీసుకొచ్చా. దయచేసి మా ఇంటికి రండి. వర్షం తగ్గే వరకూ విశ్రాంతి తీసుకుందురుగాని. అది మీ ఇల్లే అనుకోండి. ఆ రోజు మీరేగనక సాయం చేసుండకపోతే వ్యాపారం చెయ్యలేకపోయేవాడిని. జీవితంలో పైకి వచ్చానంటే అంతా మీ చలవే' అన్నాడు వినయంగా.

పున్నయ్యను తప్పుగా అర్థం చేసుకున్నందుకు వెంకన్న సిగ్గుపడ్డాడు. పున్నయ్య పలకరించకుండా వెళ్లినా, వాళ్లింటికి ఆహ్వానిస్తున్నా కూడా ఒకేలా ఉన్న అన్నయ్య ముఖంలో దేవుణ్ని చూశాడు వెంకన్న. ఆపన్నులను ఆదుకోవడానికి తనకు మారుగా భగవంతుడు అన్నయ్యలాంటి వాళ్లని సృష్టిస్తాడేమో! అనిపించింది వెంకన్నకి.

అందుకే... ఆ రోజు నుంచి తనకు తోచినంతలో పదిమందికి సాయపడాలని మనసులోనే స్థిరంగా నిర్ణయించుకున్నాడు. అన్నయ్యతో కలిపి పున్నయ్య ఇంటికి బయలుదేరాడు.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సైనిక్‌పురి, సికింద్రాబాదు





మీ వ్యాపార ప్రకటనలకు
చక్కని వేదికలు
తెలుగువెలుగు, బాలభారతం
మాసపత్రికలు

ప్రకటనల ధరలు

| రంగుల్లో | ధర రూ. లలో |
|---|---|
| లోపల పూర్తి పేజీ | 70,000 |
| లోపల సగం పేజీ | 35,000 |
| మూడో పేజీ | 87,500 |
| రెండు పేజీలు కలిపి | 1,30,000 |
| రెండు మధ్య పేజీలు | 1,40,000 |
| మొదటిపేజీ లోపలివైపు | 87,500 |
| వెనుకపేజీ లోపలివైపు | 87,500 |
| వెనుక పేజీ | 1,40,000 |

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:
+91 80081 51599, 90001 80608